మినీ జూనియర్ బేస్‌బాల్ జిల్లా జట్ల ఎంపిక

విద్యార్థులను అభినందిస్తున్న ఎంఈవో, ఉపాధ్యాయులు

డిచ్‌పల్లి, ఫిబ్రవరి 25: మినీ జూనియర్ బేస్ బాల్ అండర్ – 11 బాల, బాలికల జిల్లా జట్లను మంగళవారం ఎంపిక చేసినట్లు బేస్ బాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎల్.మధుసూదన్‌రెడ్డి, సొప్పరి వినోద్ తెలిపారు. సుద్దపల్లిలోని సాంఘిక సంక్షేమ గురుకుల బాలకల పాఠశాల క్రీడా మైదానంలో ఎంపికలు నిర్వహించారు. ప్రతిభ చూపిన వారిని జిల్లా జట్లకు ఎంపిక చేశారు. ఎంపికైన జిల్లా క్రీడాకారులు గజ్వేల్‌లో ఈనెల 28 నుంచి మార్చి 2వ తేదీ వరకు నిర్వహించనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని వారు తెలిపారు. పాఠశాల వైస్ ప్రిన్సిపాల్ స్వప్న, సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి గంగామోహన్, జూనియర్ వైస్ ప్రిన్సిపాల్ వనిత, ఫిజికల్ డైరెక్టర్ జ్యోత్స్న, జిల్లా కోచ్‌లు మౌనిక, సంతోష్, శ్రీలత పాల్గొన్నారు.

తొర్లికొండ విద్యార్థుల ఎంపిక..

జక్రాన్‌పల్లి, ఫిబ్రవరి 25: రాష్ట్రస్థాయి బేస్ బాల్ పోటీలకు మండలంలోని తొర్లికొండ జడ్పీహెచ్‌ఎస్ విద్యార్థులు ఎంపికైనట్లు పాఠశాల పీడీ గంగామోహన్ తెలిపారు. బాలికల విభాగంలో గంగోత్రి, వనజ, మైత్రి, సరిత, బాలుర విభాగంలో మురళి, విష్ణుచైతన్య, సుశాంత్, శివ బానోత్ ఎంపికయ్యారన్నారు. వారిని హెచ్‌ఎం, ఎంఈవో శ్రీనివాస్, ఉపాధ్యాయ బృందం అభినందించారు.

విద్యుత్ సమస్యలపై అవగాహన

చీమన్‌పల్లిలో అవగాహన కల్పిస్తున్న అధికారులు

సిరికొండ, ఫిబ్రవరి 25: మండలంలోని చీమన్‌పల్లి గ్రామంలో ట్రాన్స్‌కో డివిజనల్ ఇంజినీర్ (టెక్నికల్) అల్జాపూర్ రమేశ్ ఆధ్వర్యంలో మంగళవారం విద్యుత్ వినియోగదారుల అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డీఈ మాట్లాడుతూ.. విద్యుత్ సమస్యలపై ప్రతిఒక్కరికీ అవగాహన ఉండాలన్నారు. ప్రమాదాల నివారణ కోసం విద్యుత్ శాఖ కృషి చేస్తున్నదని చెప్పారు. వినియోగదారుల సమస్యలు తెలుసుకొని వాటి పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. ఎత్తు తక్కువగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద ఎల్టీ ఫ్యూజ్ సెట్లను సరిచేయాలని సిబ్బందిని ఆదేశించారు. రైతులు బోరు మోటర్లకు కెపాసిటర్లు బిగించుకోవాలని సూచించారు. విద్యుత్ సిబ్బందికి అదనంగా డబ్బులు చెల్లించవద్దని, డబ్బులు చెల్లిస్తే.. రసీదు తీసుకోవాలని సూచించారు. ఎస్ఈ గంగారాం, లైన్ ఇన్‌స్పెక్టర్ బాలచదర్, లైన్‌మెన్లు రాజేశ్వర్, పృథ్వీరాజ్, భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ యూనివర్సిటీ ఈక్వల్ ఆపర్చునిటీ సెల్ డైరెక్టర్‌గా జమీల్ అహ్మద్

డిచ్‌పల్లి, ఫిబ్రవరి 25: తెలంగాణ యూనివర్సిటీ ఈక్వల్ ఆపర్చునిటీ సెల్ డైరెక్టర్‌గా డాక్టర్ ఎండీ జమీల్ అహ్మద్ నియామకమయ్యారు. వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ యాదగిరి రావు ఆదేశాల మేరకు రిజిస్ట్రార్ ప్రొఫెసర్ యాదగిరి మంగళవారం జమీల్‌కు నియామక ఉత్తర్వులు అందించారు. జమీల్ అహ్మద్ దశాబ్ద కాలంగా హిందీ డిపార్ట్‌మెంట్‌లో సేవలందిస్తున్నారు. గతంలో హిందీ డిపార్ట్‌మెంట్ హెడ్‌గా, బీవోఎస్ చైర్మన్‌గా, పీఆర్‌వో (డైరెక్టర్)గా, చీఫ్ వార్డెన్‌గా, స్పోర్ట్స్ డైరెక్టర్‌గా విధులు నిర్వహించారు. ఈ సందర్భంగా జమీల్ అహ్మద్ మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో ఈక్వల్ ఆపర్చునిటీ సెల్ డైరెక్టర్‌గా నియమించిన వీసీ, రిజిస్ట్రార్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

సౌకర్యాల కల్పనపై ప్రత్యేక దృష్టి సారించాలి

- రంజాన్ మాసంలో ఇబ్బందులు కలుగొద్దు
- అధికారులతో సమీక్షలో కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు

అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ రాజీవ్ గాంధీ హన్మంతు

కంఠేశ్వర్, ఫిబ్రవరి 25: రంజాన్ మాసం ప్రారంభమవుతున్న నేపథ్యంలో సౌకర్యాల కల్పనపై ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు అధికారులను ఆదేశించారు. కలెక్టర్ తన చాంబర్‌లో మంగళవారం జిల్లా అధికారులతో రంజాన్ మాసం ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించారు. ఎలాంటి ఇబ్బందులు, లోటుపాట్లకు తావులేకుండా సమన్వయంతో పని చేయాలని అధికారులకు సూచించారు. ఎక్కడ కూడా తాగునీరు, పారిశుద్ధ్యం వంటి సమస్యలు తలెత్తకుండా క్షేత్రస్థాయి అధికారులు, సిబ్బందికి బాధ్యతలు అప్పగిస్తూ నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చూడాలని, వీధిలైట్ల మరమ్మతు చేయించాలన్నారు. తాగునీటి కోసం ప్రణాళికాబద్ధంగా కృషి చేయాలని మిషన్ భగీరథ ఈఈ రాకేశ్‌కు సూచించారు. ఆయా జలాశయాలు చెరువుల్లో అందుబాటులోని నీటి నిల్వలు ఎన్ని రోజుల వరకు తాగునీటి సరఫరా కోసం అవి సరిపోతాయి తదితర వివరాలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. జిల్లాలోని అన్ని నివాస ప్రాంతాలతో పాటు అన్ని ప్రభుత్వ పాఠశాలలు, రెసిడెన్సియల్ స్కూల్స్, వసతిగృహాలకు రక్షిత మంచినీరు సరఫరా అయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్‌కుమార్, బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో, అదనపు డీసీపీ బస్వారెడ్డి, జడ్పీ సీఈవో సాయాగౌడ్, మున్సిపల్ కమిషనర్ దిలీప్‌కుమార్, డీపీవో శ్రీనివాస్, డీఎంహెచ్‌వో రాజశ్రీ, అధికారులు కృష్ణవేణి, యోహాన్, రాజావెంకట్‌రెడ్డి, శ్రీనివాస్, వెంకటేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

నిబంధనలు పాటించని విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలి

నిరసన వ్యక్తంచేస్తున్న పీడీఎస్‌యూ నాయకులు

ఖలీల్‌వాడి, ఫిబ్రవరి 25: ప్రభుత్వ నిబంధనలను పాటించని విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాలని పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో నగరంలోని గూపన్‌పల్లి శ్రీచైతన్య పాఠశాలలో మంగళవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా పాఠశాల అడ్మిషన్ కరపత్రాలను దహనం చేశారు. అనంతరం జిల్లా విద్యాశాఖాధికారి అశోక్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం.నరేందర్, డాక్టర్ కర్క గణేశ్ మాట్లాడుతూ.. విద్యా పూర్తిగా వ్యాపారమైందని ఆరోపించారు. గల్లీ గల్లీకి తోకల పేర్లు తగిలించుకుని కార్పొరేట్ విద్యాసంస్థలు యథేచ్ఛగా లక్షల్లో ఫీజులు వసూలు చేస్తున్నా.. అధికారులు పట్టించుకోవడం లేదని, రాష్ట్ర ప్రభుత్వం వాటిపై చర్యలు తీసుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తంచేశారు. అర్హత లేని ఉపాధ్యాయులను నియమిస్తూ, రేకుల షెడ్లు, బల్డింగుల్లో తరగతి గదులు నిర్వహిస్తున్నారని ఆరోపించారు. విద్యా సంవత్సరం ప్రారంభానికి ముందే అడ్మిషన్లు చేసుకుంటున్నారని, అలాంటి విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని డీఈవోకు సమర్పించిన వినతిపత్రంలో కోరారు. కార్యక్రమంలో నాయకులు అనిల్‌కుమార్, నిఖిల్, వినోద్, నాగేశ్, నసీర్, సంతోష్, సునీల్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

డబ్బులు వృథా చేయొద్దు

పొదుపుపై అవగాహన కల్పిస్తున్న కౌన్సిలర్లు

కోటగిరి, ఫిబ్రవరి 25: డబ్బులను వృథా చేయకుండా మహిళలు పొదుపు ఏ విధంగా చేయాలనే అంశంపై రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో మహిళలకు అవగాహన సదస్సు నిర్వహిస్తున్నారు. కార్యక్రమంలో భాగంగా మంగళవారం బస్వాపూర్‌లో ఉపాధి హామీ కూలీలతో సమావేశం ఏర్పాటు చేసి పొదుపు ఏ విధంగా చేయాలి, పొదుపు చేయడంతో కలిగే ప్రయోజనాలు వివరించారు. డబ్బులను అవసరంమేరకే వాడుకోవాలని, వృథా ఖర్చులు చేయొద్దని సూచించారు. కార్యక్రమంలో వర్ని సీఎఫ్ఎల్ కౌన్సిలర్లు అరుణ్‌కుమార్, వినయ్‌కుమార్, బాబు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ సైన్స్ దినోత్సవం

విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న అతిథులు

ఖలీల్‌వాడి, ఫిబ్రవరి 25: నగరంలోని నిర్మల హృదయ పాఠశాలలో మంగళవారం జాతీయ సైన్స్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. డీఈవో అశోక్, జిల్లా సహకార బ్యాంకు ముఖ్య కార్యనిర్వహణ అధికారి నాగభూషణం హాజరై మాట్లాడారు. విద్యార్థి తన జీవితంలో సాంకేతికతను జోడించుకొని ముందుకు వెళ్లాలని సూచించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సైన్స్ ఫెయిర్‌లో ప్రతిభ చూపిన వారికి జిల్లా సహకార బ్యాంకు తరపున బహుమతులు అందజేశారు.

విజ్ఞాన శాస్త్రంతో నవీన ఆవిష్కరణలు..

సిరికొండ, ఫిబ్రవరి 25: విజ్ఞాన శాస్త్రంతో నవీన ఆవిష్కరణలు సాధ్యమని సత్యశోధక్ పాఠశాల ప్రిన్సిపాల్ ఆర్.నర్సయ్య అన్నారు. జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని పాఠశాలలో ఏర్పాటుచేసిన శాస్త్రీయ విజ్ఞాన శాస్త్ర ప్రదర్శనను ఆయన ప్రారంభించారు. విద్యార్థులు తయారుచేసి, ప్రదర్శించిన ఎగ్జిబిట్లు ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా విద్యార్థులకు క్విజ్, చిత్రలేఖనం, ఉపన్యాసం, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అడవికి నిప్పు

సిరికొండ శివారులో కాలిపోతున్న అడవి

సిరికొండ, ఫిబ్రవరి 25: అటవీశాఖ అధికారులు పర్యవేక్షణ లోపించడంతో అడవి దహించుకుపోతున్నది. మండలంలో గుర్తు తెలియని వ్యక్తులు అడవికి నిప్పు పెట్టడంతో విలువైన చెట్లు ఖాళీ బూడిదవుతున్నాయి. పలు అడవి జంతువులు అగ్నికి ఆహుతవుతున్నాయి. అటవికి నిప్పు పెట్టకుండా ఫారెస్టు అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రకృతి ప్రేమికులు కోరుతున్నారు.

ప్రిన్సిపాల్‌ను కలిసిన విద్యార్థి సంఘ నాయకులు

ప్రిన్సిపాల్ ప్రవీణ్‌కుమార్‌ను సన్మానిస్తున్న విద్యార్థి సంఘం నేతలు

డిచ్‌పల్లి, ఫిబ్రవరి 25: తెలంగాణ యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీ కొత్త ప్రిన్సిపాల్ మామిడాల ప్రవీణ్‌కుమార్‌ను ఎన్ఎస్‌యూఐ, గిరిజన శక్తి సంఘం యూనివర్సిటీ నాయకులు మంగళవారం కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కాలేజీలో నెలకొన్న సమస్యలు పరిష్కరించేందుకు ప్రిన్సిపాల్ కృషి చేయాలని కోరారు. అనంతరం ప్రిన్సిపాల్‌ను సన్మానించారు. కార్యక్రమంలో వర్సిటీ ఎన్ఎస్‌యూఐ, గిరిజన శక్తి అధ్యక్షులు సాగర్‌నాయక్, శ్రీనూ రాథోడ్, నాయకులు లక్ష్మణ్, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

తొర్లికొండలో వీసీబీ ఏర్పాటు

వీసీబీ బ్రేకర్‌ను ప్రారంభిస్తున్న విద్యుత్ శాఖ అధికారులు

జక్రాన్‌పల్లి, ఫిబ్రవరి 25: వేసవికాలంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగకుండా ఉండేందుకు మండలంలోని తొర్లికొండ 33/11 కేవీ సబ్‌స్టేషన్‌లో వీసీబీ బ్రేకర్‌ను మంగళవారం ఏర్పాటు చేసినట్లు ఎస్ఈ రవీందర్ తెలిపారు. ఇంతవరకు సబ్‌స్టేషన్‌లో గ్రామానికి లిఫ్ట్ ఫీడర్‌కు ఒకే వీసీబీ ఉండేదన్నారు. అదనంగా మరో వీసీబీని అమర్చామన్నారు. కార్యక్రమంలో టెక్నికల్ డీఈ రమేశ్, డిచ్‌పల్లి డీఈ ఉత్తమ్, జక్రాన్‌పల్లి ఏఈ ప్రవీణ్‌కుమార్, లైన్‌మన్ బలరాం, గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పిల్లల ప్రవర్తనను గమనిస్తూ ఉండాలి

బోధన్ సెకండ్‌క్లాస్ మేజిస్ట్రేట్ శేషతల్పశాయి

మాట్లాడుతున్న న్యాయమూర్తి శేషతల్పశాయి, పక్కన ఎంఈవో నాగయ్య, సీఐ వెంకటరమణ

బోధన్, ఫిబ్రవరి 25: తల్లిదండ్రులు పిల్లల ప్రవర్తనను గమనిస్తూ ఉండాలని, ప్రతి రోజూ ఒక గంట పాటు ఆటలు ఆడించి, ఆ తర్వాత వారిని చదివించాలని బోధన్ సెకండ్‌క్లాస్ మేజిస్ట్రేట్ శేషతల్పశాయి చెప్పారు. మంగళవారం బోధన్ పట్టణంలోని శ్రీ విజయసాయి ప్రైమరీ స్కూల్ సిల్వర్ జూబ్లీ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గౌరవ అతిథిగా పాల్గొన్న సెకండ్‌క్లాస్ మేజిస్ట్రేట్ మాట్లాడుతూ విజయసాయి ప్రైమరీ స్కూల్‌లో చదివిన ఎంతో మంది ప్రస్తుతం ఉన్నతస్థానాల్లో ఉన్నారని అన్నారు. బోధన్ ఎంఈవో నాగయ్య మాట్లాడుతూ తన కుమారుడు కూడా ఇదే పాఠశాలలో చదివి ఇప్పుడు అమెరికాలో స్థిరపడ్డాడని ఆ పాఠశాల యాజమాన్యాన్ని అభినందించారు. అనంతరం బోధన్ టౌన్ సీఐ వెంకటరమణ మాట్లాడారు. ఈ వేడుకల్లో 'బెస్ట్ అవుట్ గోయింగ్ స్టూడెంట్'గా ఎంపికైన సాదియా ఫాతిమాకు అతిథులు ప్రశంసాపత్రాన్ని అందించి అభినందించారు. వివిధ పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందించారు. 25 ఏండ్లు ఈ స్కూల్‌లో పనిచేసిన పూర్వ ఉపాధ్యాయులను సత్కరించారు. సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. వేడుకల్లో శ్రీ విజయసాయి హైస్కూల్ ప్రిన్సిపాల్ ఎస్.కృష్ణమోహన్, మేనేజర్ ఐఆర్ చక్రవర్తి, ప్రైమరీ స్కూల్ హెచ్‌ఎం సాగిరాజు కల్పన, యాజమాన్యం ప్రతినిధులు సువర్చల, ప్రసూన, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎస్‌హెచ్‌వో సత్యనారాయణ

మెండోరా/ఆర్మూర్‌టౌన్, ఫిబ్రవరి 25: ఈనెల 27వ తేదీన ఎమ్మెల్సీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో మెండోరా మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల పోలింగ్ కేంద్రాన్ని పోలింగ్ స్టేషన్ జోనల్ అధికారి గజానన్ మంగళవారం పరిశీలించారు. పోలింగ్ కేంద్రంలోని సౌకర్యాలపై ఆరా తీశారు. ఆయన వెంట తహసీల్దార్ సంతోష్‌రెడ్డి, ఎస్సై నారాయణ, మండల విద్యాధికారి శ్రీనివాస్ తదితరులు ఉన్నారు. ఆర్మూర్ పట్టణంలోని పెర్కిట్ జడ్పీహెచ్‌ఎస్‌లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాన్ని ఎస్‌హెచ్‌వో సత్యనారాయణ, తహసీల్దార్ సత్యనారాయణ పరిశీలించారు. పోలింగ్ కేంద్రంలోని సౌకర్యాలను పరిశీలించారు. ఎన్నికల నేపథ్యంలో ఓటర్లకు ఇబ్బందులు కలగకుండా చూడాలని సిబ్బందికి సూచించారు.

సై టీబీ పరీక్ష చేయించుకోవాలి

వేల్పూర్, ఫిబ్రవరి 25: క్షయ వ్యాధి నివారణకు ముందస్తు చర్యల్లో భాగంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సై–టీబీ కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా చేపట్టాయని జిల్లా టీబీ నియంత్రణ అధికారిణి దేవి నాగేశ్వరి అన్నారు. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం సై–టీబీ పరీక్షలను టీబీ రోగుల కుటుంబ సభ్యులకు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. ఆరోగ్య కేంద్రంలో టీబీ రోగుల కుటుంబ సభ్యులకు ఈ పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. సై–టీబీ పరీక్ష చేస్తే మానవ శరీరంలో టీబీ ఇన్ఫెక్షన్ ఉందో లేదో తెలుస్తుందని అనారు. కొన్ని సందర్భాల్లో మనిషిలో టీబీ లక్షణాలు కనబడకపోయినా శరీరంలో టీబీ ఇన్ఫెక్షన్ ఉండొచ్చని అన్నారు. అలాంటి వాటిని కూడా సై–టీబీ పరీక్షతో గుర్తించవచ్చని అన్నారు. డయాబెటిక్, టీబీ కాంట్రాక్ట్, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారు ఈ పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో రమేశ్, వైద్యులు వీణా, శరత్‌చంద్ర, జిల్లా టీబీ కోఆర్డినేటర్ రవిగౌడ్, సీహెచ్‌వో నారాయణ, వేణు పాల్గొన్నారు.

వరిలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

మోర్తాడ్, ఫిబ్రవరి 25: మండలంలో వరిపంటకు అగ్గితెగులు సోకినట్లు గుర్తించామని, దీనిని గుర్తించిన వెంటనే జాగ్రత్తలు తీసుకోవాలని, లేకపోతే భారీగా దిగుబడులు తగ్గే అవకాశాలు ఉన్నాయని ఏవో హరీశ్‌కుమార్ సూచించారు. వరి ఆకులపై నూలు కండె ఆకారంలో మచ్చలు ఏర్పడి ఆకంతా వ్యాపిస్తుందని, దీని నివారణకు గట్లను శుభ్రంగా ఉంచుకోవాలని అన్నారు. నత్రజని సంబంధిత ఎరువుల వాడకాన్ని తగ్గించాలని సూచించారు. వరి పొలంలో నీరు పలుచగా ఉండేలా చూసుకోవాలని చెప్పారు. వ్యవసాయాధికారులను సంప్రదించి మందులు పిచికారీ చేయాలని సూచించారు.

ప్రతి మొక్కకూ నీరందించాలి

భీమ్‌గల్, ఫిబ్రవరి 25: నర్సరీలో పెంచుతున్న ప్రతి మొక్కకూ నీరందించాలని ఎంపీడీవో సంతోష్ కుమార్ సిబ్బందికి సూచించారు. మంగళవారం ఆయన మండలంలోని బడాభీమ్‌గల్, చేంగల్ గ్రామాల్లో ఉపాధి హామీ పథకం ద్వారా నిర్వహిస్తున్న నర్సరీలను పరిశీలించారు. ఈ సందర్భంగా నర్సరీ సిబ్బందికి పలు సూచలను చేశారు. ఆయన వెంట ఏపీఎం నర్సయ్య, పంచాయతీ కార్యదర్శులు రజిత, ప్రదీప్ ఉపాధి హామీ టెక్నికల్ అసిస్టెంట్ గణేశ్ ఉన్నారు.

హక్కులపై అవగాహన

విద్యార్థులతో మాట్లాడుతున్న సేవాధికార సంస్థ ప్రతినిధులు

ఆర్మూర్‌టౌన్, ఫిబ్రవరి25: పట్టణంలోని భవిత ప్రత్యేక అవసరాలు గల పిల్లల వనరుల కేంద్రాన్ని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ పారా లీగల్ వలంటీర్లు బాబాగౌడ్, జీవన్‌రావు, ఎంఈవో రాజ గంగారాంతో కలిసి మంగళవారం సందర్శించారు. విద్యహక్కు చట్టం, బాల్య వివాహాలు, బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన, బడి బయటి పిల్లలను బడిలో చేర్పించడం తదితర అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు.

'టీఎల్‌ఎం'లో బహుమతి

ఏర్గట్ల, ఫిబ్రవరి 25: టీచర్ లర్నింగ్ మెటీరియల్ విభాగంలో తమ పాఠశాలకు చెందిన భౌతికశాస్త్ర ఉపాధ్యాయుడు గాండ్ల రాజశేఖర్‌కు ద్వితీయ బహుమతి లభించినట్లు ఏర్గట్ల జడ్పీ ఉన్నత పాఠశాల గెజిటెడ్ హెచ్‌ఎం కోమరగిరి కృష్ణచారి తెలిపారు. ఈ నెల 28న నిర్వహించనున్న జాతీయ సైన్స్ డేను పురస్కరించుకొని జిల్లా కేంద్రంలోని నిర్మల హృదయ ఉన్నత పాఠశాలలో జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన సైన్స్ సంబురాల్లో దీనిని ప్రదర్శించినట్లు తెలిపారు. ఉపాధ్యాయుడిని తోటి సిబ్బంది అభినందించారు.

బహుమతి అందుకుంటున్న గాండ్ల రాజశేఖర్

భూముల వేలము ప్రకటన

ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం లి., : డొంకేశ్వర్, మం॥నందిపేట్, జి॥నిజామాబాద్
(యస్.సి.డి.ఆర్ / ఆఫీసర్ ఆన్‌స్పెషల్ డ్యూటీ ఎన్.డి.సి.సి. బ్యాంక్ లి., నిజామాబాద్ వారి ఉత్తర్వులననుసరించి)

ఇందుమూలముగా తెలియపరుచునది ఏమనగా ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం లి. డొంకేశ్వర్, మం॥నందిపేట్, జి॥నిజామాబాద్‌నకు బాకీ పడిన సొమ్ము మొత్తమును రాబట్టుటకు గాను ఈ దిగువ తెలిపిన తనఖా చేయబడిన భూములను తెలంగాణ సహకార సంఘాల చట్టంలోని రూలు 52 ప్రకారము బహిరంగ వేలము ద్వారా విక్రయించుటకు నిర్ణయించనైనది. కావున సదరు వేలములో పాల్గొనుటకు ఆసక్తిగలవారు ఈ దిగువ తెలుపబడిన షరతులు మరియు నిబంధనలకు లోబడి పాల్గొనగలరు.

బాకీదారుని /తనఖాదారుని తండ్రి / భర్త పేరు	అమ్మబడు తనఖా వ్యవసాయ భూమి వివరాలు: సర్వే నెం	విస్తీర్ణం (ఎ.గుంట)	శివారు	వేలము తేది సమయం స్థలం	ఇ.పి.నెం.బాకీ బడిన సొమ్ము	వేలము నందు పాల్గొనుటకు ధరావత్తు సొమ్ము
శ్రీమతి గజ్జెల లావణ్య (బాకీదారు) భర్త: ధర్మన్న గ్రా॥ డొంకేశ్వర్, మం॥ నందిపేట్ జి॥ నిజామాబాద్.	362/2 362/3	1.0100 0.1500	డొంకేశ్వర్	తేది: 27.02.2025 గురువారము ఉ॥ 2-00 గం॥లకు డొంకేశ్వర్ గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణలో	ఇ.పి.నెం. 168/LT/2022-23 రూ॥ 3,41,987/- అదనంగా (+) వడ్డీ (+) అపరాధపు వడ్డీ (+) తదుపరి కిస్తులు ఉన్నచో వడ్డీతో సహా (+) జప్తు ఖర్చులు (+) ఇతర ఖర్చులు	రూ॥ 10,000/-

షరతులు మరియు నిబంధనలు

1. పైన తెలుపబడిన తనఖా చేయబడిన భూముల వేలము వేయుటకు అమ్మకపు అధికారికి పూర్తి అధికారము గలదు.
2. వేలము బహిరంగముగా జరుపబడును.
3. ప్రకటనలో తెలిపిన బాకీదారుని ఆస్తి ఏకమొత్తములో వేలము వేయుటకు సేల్ ఆఫీసర్ గారికి అధికారము కలదు.
4.వేలము సమయమునకు ముందుగా బకాయిదారులు గాని అతని ప్రతినిధి గాని బాకీ పడిన సొమ్ము చెల్లించిన యెడల వేలము వాయిదా వేయబడును లేదా రద్దు చేయబడును.
5.వేలము నందు పాల్గొనుటకు ఆసక్తి గలవారు ధరావత్తు సొమ్మును ముందుగా అమ్మకపు అధికారికి గాని సంఘ కార్యదర్శికి గాని డిడి లేదా నగదు రూపేణా స్వయంగా లేదా ప్రతినిధి ద్వారా చెల్లించి రశీదు పొందగలరు. సదరు వేలము వాయిదా బడిన లేదా రద్దు అయినను సదరు వ్యక్తి ఏ కారణముచేనైనా వేలములో పాల్గొనుటకు ఇష్టపడని యెడల ఇట్టి ధరావత్తు సొమ్ము వాపసు చేయబడును.
6.ధరావత్తు సొమ్ము చెల్లించిన వారు మాత్రమే వేలములో పాల్గొనుటకు అర్హులు.
7.సదరు వేలమునందు అధిక ధర పాట పాడిన వారికి వ్యవసాయ భూమిని (ఉన్నది ఉన్నట్లుగా) అప్పగించుటకు సేల్ ఆఫీసర్ గారికి అధికారము గలదు. వేలము తేది నుండి (30 రోజుల) తరువాత సేల్ సర్టిఫికేట్ ఇవ్వబడును.
8. సదరు వేలములో అధికముగా వేలం పాడిన వ్యక్తి వేలం పాటపాడిన కొనుగోలు సొమ్ము మొత్తములో 15 శాతం సొమ్ము తక్షణమే డిపాజిట్ చేయవలెను. మిగతా సొమ్మును 15 రోజుల గడువు లోపుగా చెల్లించవలెను. గడువులోగా పూర్తి సొమ్మును కొనుగోలుదారు చెల్లించని యెడల 15% డిపాజిట్ సొమ్మును వేలం పాటదారుడు కోల్పోగలడు. మరియు అట్టి ఆస్తి తిరిగి వేలం వేయబడును. కొనుగోలుదారుడు అట్టి ఆస్తిని గాని అది అమ్మబడిన తరువాత ఏదేని భాగమునకు గాని అన్ని హక్కులను వదులుకొనవలెను. మొదటి కొనుగోలు దారుని రిస్క్ మీద సదరు ఆస్తిని తిరిగి వేలము వేయబడును. తిరిగి వేలము వేయుటకు అగు ఖర్చును మొదటి కొనుగోలుదారు భరించవలెను.
9. స్టాంపు డ్యూటీ రిజిస్ట్రేషన్ మరియు ఇతర చార్జీలు కొనుగోలుదారుడే భరించవలెను.
10. వేలం పాట పాడిన ధర అనుచితముగా లేదా తక్కువగా ఉన్న యెడలగాని లేదా ఇతర కారణముల వలన గాని హెచ్చువేలం పాటను అమ్మకపు అధికారి తిరస్కరించవచ్చును.
11. డిక్రీ హోల్డర్ అయిన ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం లి., డొంకేశ్వర్ బ్రాంచి వేలములో పాల్గొనుటకు మరియు సెట్ ఆఫ్ చేసుకొనుటకు అర్హత కలదు.
12. వేలము నడపుటకు, ఖాయపరుచుటకు, వాయిదా వేయుటకు, రద్దు చేయుటకు అమ్మకపు అధికారికి పూర్తి స్వేచ్ఛ కలదు.
13.భూమి సర్వే నెంబర్ మరియు విస్తీర్ణము మొ॥ వివరముల యందు ఒకవేళ తప్పులు ఉన్నచో దానికి ప్రభుత్వము బాధ్యత వహించదని గమనించగలరు.

తేది: 01-02-2025 సం/- మేనేజర్ / అమ్మకపు అధికారి
నిజామాబాద్. ది.నిజామాబాద్ జిల్లా సహకార కేంద్ర బ్యాంకు లి., నిజామాబాద్

27 వరకు మద్యం, కల్లు విక్రయాలు బంద్

శక్కర్‌నగర్, ఫిబ్రవరి 25: పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా ఈనెల 27 సాయంత్రం 4 గంటల వరకు మద్యం, కల్లు విక్రయాలు జరుపవద్దని బోధన్ ఎక్సైజ్ సీఐ పవన్ కుమార్ గౌడ్ అన్నారు. మంగళవారం సాయంత్రం బోధన్ పట్టణంలోని పలు మద్యం షాపులకు ఆయన, సిబ్బందితో కలిసి సీల్ వేశారు. ఎన్నికల కమిషన్ నిబంధనల ప్రకారం మద్యం, కల్లు విక్రయాలు బంద్ చేసినట్లు ఆయన తెలిపారు. ఎవరైనా నిబంధనలు అతిక్రమిస్తే వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

హర హర మహాదేవ..!

- శివరాత్రి ఉత్సవాలకు శైవాలయాలు ముస్తాబు

జిల్లా కేంద్రంలోని మార్కెట్‌లో పండ్లు కొనుగోలు చేస్తున్న ప్రజలు

సుభాష్‌నగర్, ఫిబ్రవరి 25 : మహా శివరాత్రి ఉత్సవాలను బుధవారం నిర్వహించనున్నారు. ఇందుకోసం శైవాలయాలు ముస్తాబయ్యాయి. ఆలయాల్లో భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఉదయం నుంచే ఆలయాలను దర్శించుకునేందుకు భక్తులు తరలిరానున్నారు. పండుగ సందర్భంగా ఉపవాసం ఉండి, రాత్రి వేళ జాగరణ చేసేందుకు భక్తులు సిద్ధమయ్యారు. నగరంలోని నీలకంఠేశ్వరాలయం, శంభునిగుడి, మనోకామేశ్వరాలయం, మార్కండేయ మందిరం, నగరేశ్వరాలయం, గణపతి సచ్చిదానంద స్వామి ఆశ్రమాలయాలను విద్యుత్ దీపాలతో అలంకరించారు. పండుగ సందర్భంగా పూలు, పండ్లకు డిమాండ్ పెరిగింది. వ్యాపారులు ధరలు పెంచి వాటిని విక్రయించారు. సిరికొండ మండలంలోని లొంక రామలింగేశ్వర స్వామి ఆలయంలో నేటి నుంచి మూడు రోజుల పాటు ఉత్సవాలను నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ బాధ్యులు తెలిపారు. మోర్తాడ్, కమ్మర్‌పల్లి గ్రామాల్లో ఉన్న శివాలయాలను ఆలయకమిటీల ఆధ్వర్యంలో ముస్తాబు చేశారు. మోర్తాడ్ మండలం వడ్యాట్, మోర్తాడ్, తిమ్మాపూర్, ధర్మోరా, శెట్‌పల్లి గ్రామాల్లో కమ్మర్‌పల్లి మండలం ఉప్లూర్, ఆర్‌ఈర్‌నగర్, కమ్మర్‌పల్లిలో శివాలయాలు ముస్తాబయ్యాయి. భీమ్‌గల్ పట్టణంలోని నందీశ్వర ఆలయం సర్వ సమాజ్ కమిటీ ఆధ్వర్యంలో ముస్తాబు చేశారు. ఆలయం వద్ద విద్యుత్ సమస్య తలెత్తకుండా నూతనంగా ట్రాన్స్‌ఫార్మను ఏర్పాటు చేశారు. కుప్పకంటి, పురాణీపేట్,బడా భీమ్‌గల్ శివాలయాల్లో అన్ని ఏర్పాట్లు చేశారు. ముప్కాల్‌లో పడిలేచిన మర్రిచెట్టు వద్ద ఏర్పాట్లు చేశారు.

విద్యుత్ సబ్ స్టేషన్‌లో కొత్త ఫీడర్ ప్రారంభం

ఫీడర్‌ను ప్రారంభిస్తున్న డీఈ శ్రీనివాస్

మాక్లూర్(నందిపేట్), ఫిబ్రవరి 25: ఒకే బ్రేకర్‌పై ఉన్న రెండు ఫీడర్ లైన్లను కంఠం విద్యుత్ ఉపకేంద్రం, తొండకూర్ ఉప కేంద్రంలో వేరు చేసి కొత్తగా బ్రేకర్లు ఏర్పాటు చేశామని ట్రాన్స్‌కో డివిజనల్ ఇంజినీర్ మెన్నేని శ్రీనివాస్ తెలిపారు. కొత్త బ్రేకర్లను మంగళవారం ఆయన ప్రారంభించారు. అనంతరం తొండాకూర్‌లో రైతులతో కలిసి పొలంబాట కార్యక్రమం నిర్వహించి రైతుల సమస్యలు తెలుసుకొని పరిష్కార మార్గాలు చూపారు. కార్యక్రమంలో ఏడీఈ అశోక్, ఏఈలు రవి, రమేశ్ పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలాన్ని కాపాడాలి

బాల్కొండ, ఫిబ్రవరి 25: మండల కేంద్రంలోని మోడల్ స్కూల్ వెనక భాగంలో ఉన్న ప్రభుత్వ స్థలాన్ని కబ్జాదారుల నుంచి కాపాడాలని కోరుతూ తహసీల్దార్ శ్రీధర్‌కు మంగళవారం గ్రామస్తులు వినతిపత్రం అందజేశారు. 8 నెలల క్రితం జేసీబీ, ట్రాక్టర్లతో భూమిని చదును చేసిన వ్యక్తి శంషును పిలిపించి అడగగా నిర్మాణాన్ని తొలగిస్తానని చెప్పాడని, ప్రస్తుతం గోడ నిర్మించి కలర్ వేశాడని ఫిర్యాదులో పేర్కొన్నారు. గ్రామంలో అలజడి సృష్టించేలా వ్యవహరిస్తున్న వారిపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని కోరారు.

నమస్తే తెలంగాణ CLASSIFIEDS క్లాసిఫైడ్స్

CHANGE OF NAME

I, **PENDAM NARENDAR**, S/o. Pendem Bhumeshwar, R/o.H.No.6-59, Morthad Vill. & Mdl. Nizamabad Dist., T.S., My Passport No. **H2025508** have changed my name as **PENDEM NARENDHER** (New name)
NTZ-338516

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
4 లైన్ల క్లాసిఫైడ్స్ 200/- మాత్రమే.

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.